క్లుప్తంగా

నియామక పత్రం అందజేత



స్వాతికి కారుణ్య నియామక పత్రాన్ని అందజేస్తున్న కృష్ణచైతన్య

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు గ్రామ రెవెన్యూ సహాయకురాలిగా ఓదరుగుడి స్వాతికి శుక్రవారం శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య నియామక పత్రాన్ని అందజేశారు. గ్రామంలో రెవెన్యూ సహాయకుడిగా పనిచేస్తూ ఓదరుగుడి భానుచందర్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మరణించారు. కారుణ్య నియామకం కింద స్వాతిని రెవెన్యూ సహాయకురాలిగా నియమించారు.

నేడు సర్వసభ్య సమావేశం

జే.పంగులూరు: మండల పరిషత్ కార్యాలయంలో నేడు సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీఓ రామాంజినేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని ప్రజా సమస్యలపై చర్చ జరగాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమం ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరగనున్నట్లు తెలిపారు.

అలసత్వం వహిస్తే విధుల నుంచి తొలగిస్తాం

చీరాల అర్బన్: పట్టణంలోని వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలకు సేవలందించే విషయంలో అలసత్వం వహిస్తే వారిని విధుల నుంచి తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ కే రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని 25 వార్డు సచివాలయాల్లో ప్రజలకు సేవలందించే విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే వారిని విధుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే తమకు నేరుగా ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చెయ్యాలి

కారంచేడు: గ్రామాల్లోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంను బలోపేతం చెయ్యడానికి కార్యకర్తలు, ఆయాలు నిరంతర కృషి చేయాలని ఐసీడీఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీవో తిరుమలశెట్టి ఝాన్సీ అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని కుంకలమర్రు గ్రామంలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి సెంటర్‌లోను విద్యార్థుల నమోదు, హాజరుశాతం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కారంచేడు సెక్టార్ సూపర్‌వైజర్ హిమబిందు, అన్ని సెంటర్ల కార్యకర్తలు, తల్లులు, గర్భవతులు, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకోవాలి

బల్లికురవ: విద్యుత్ అక్రమ వాడకం చట్టరీత్యా నేరమని.. అందుకు మీటర్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆశాఖ ఏఈ పీ. శ్రీనివాస్ కోరారు. ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలు లేఅవుట్లలో మంజూరు చేసిన పక్కా గృహాలకు, ఎస్సీ, ఎస్టీలకు రూ. 51 లకే మీటర్ల అందజేస్తున్నామన్నారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏఈ కోరారు.

21 నుంచి ఈర్లగంగమ్మ కొలుపులు, ప్రతిష్ట

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో గోరంట్ల వారి దేవర ఈర్ల గంగమ్మ తల్లి కొలుపులు, ప్రతిష్టా మహోత్సవాలు సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. గ్రామ కూడలిలో గోరంట్ల ఆంజనేయులు రెండు సెంట్ల స్థలాన్ని ఉదారంగా ఇచ్చారు. మరి కొంత స్థలం సేకరణతో గ్రామంతో పాటు, పరిసర గ్రామాల్లోని భక్తుల నుంచి విరాళాల సేకరణతో సుమారు రూ. 20 లక్షలతో ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. పనులు తుది దశకు చేరాయి.

ముద్ద ముద్దలో సంతోషం

- గోరుముద్దతో పౌష్టికాహారం
- గతం కంటే మెరుగైన మెనూ
- మంచి పోషక విలువలతో మధ్యాహ్న భోజనం
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



పౌష్టికాహారం మెనూ



స్వర్ణలో భోజనాన్ని రుచి చూస్తున్న స్పెషల్ ఆఫీసర్, ఈవోపీఆర్డీ (ఫైల్)

కారంచేడు:

ప్రభుత్వ పాఠశాలలు.. విద్యార్థులను గత టీడీపీ ప్రభుత్వం చిన్నచూపు చూసింది. ప్రభుత్వ పాఠశాలల విద్య బాధ్యత ప్రభుత్వానిదే కాదు.. ప్రైవేటు సంస్థలు కూడా బాధ్యతలు తీసుకోవాలని అని చెప్పి మొత్తం కార్పొరేట్ సేవలో తరించిన దుస్థితి గత ప్రభుత్వానిది. కాని ఇప్పుడు పరిస్థితి మారింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పాఠశాలల తీరు పూర్తిగా మారిపోయింది. నాడు–నేడు పథకంలో పాఠశాలల రూపురేఖలు మార్చి దేశంలో చరిత్ర సృష్టించాడు సీఎం జగన్. అంతేకాదు అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన తదితర పథకాలు ప్రవేశపెట్టి విద్యా వ్యవస్థను మార్చాడు. అంతేకాకుండా మెరుగైన పౌష్టికాహారాన్ని అందిస్తూ విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వానికి బాటలు వేసింది ప్రభుత్వం. 'జగనన్న గోరుముద్ద' విద్యార్థులకు వరంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మంచి పోషక విలువలుండే ఆహార నియమాలను ప్రభుత్వ పాఠశాలల్లో పాటిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కంటే మెరుగైన మెనూను అందించడంతో గతంలో నూటి 50 శాతం కూడా ఎండీఎంకు హాజరు కాని విద్యార్థులు నేడు 90 శాతానికి పైగా ఎండీఎంలో మంచి రుచిగల మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ప్రతి రోజు విద్యార్థులకు వడ్డించే ఆహారాన్ని ఉపాధ్యాయులు, లేదా విజిట్‌కు వచ్చిన ఎంఈవో, ఎంపీడీవో, తహశీల్దార్, ఉన్నతాధికారులు, ప్రత్యేక అధికారులు సైతం విద్యార్థులతో కలసి కూర్చొని భోజనం రచి చూస్తున్నారంటే ఆహారంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో అర్థం అవుతుంది.

అవినీతికి ఆస్కారం లేని మెనూ..

వారంలో ప్రతి రోజూ ప్రభుత్వ నిబంధనల మేర మెనూను కచ్చితంగా అమలు చేయాల్సిందే. సోమవారం మెనూను, మంగళవారం చేస్తామంటే కుదరదు. కారణమేమంటే ప్రతి రోజు ఆ పాఠశాల హెచ్‌ఎం మధ్యాహ్న భోజనాన్ని ఫొటో తీసి ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సోమవారం మెనూను మంగళవారం ఫొటో పెడితే యాప్ తీసుకోదు. దీంతో కుకింగ్ నిర్వాహకులు ఎలాంటి అజాగ్రత్తలు, అవినీతికి పాల్పడకుండా ఉండేందుకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు.

100 శాతం అదించేలా ఏర్పాట్లు..

మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో 26 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 1 ప్రాథమికోన్నత పాఠశాల, 5 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో సుమారు 1100 మంది వరకు విద్యార్థులున్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉండే విద్యార్థులకు కుకింగ్ నిర్వాహకులకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ 5.88, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు రూ 8.57 అందిస్తోంది. ఇవి కాకుండా ఒక్కో విద్యార్థికి 100, 150 గ్రాముల బియ్యం, కోడి గుడ్లు కూడా ప్రభుత్వం నిర్వాహకులకు అందిస్తుంది. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో 90 శాతం మంది విద్యార్థులు ఎండీఎంను తింటుండగా 100 శాతం విద్యార్థులు తినేలా విద్యశాఖ చర్యలు తీసుకుంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అమలయ్యే నూతన మెనూ..

సోమవారం:	హాట్ పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు/కూరగాయల పలావ్, గుడ్డు కూర, వేరుశనగ చిక్కీ
మంగళవారం:	పులిహోర, టమాటా పచ్చడి/ దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు, రాగిజావ
బుధవారం:	కూరగాయలతో అన్నం, బంగాళాదుంపల కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ
గురువారం:	సాంబార్ బాత్, ఉడికించిన కోడిగుడ్డు, రాగి జావ
శుక్రవారం:	అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, వేరుశనగ చిక్కీ
శనివారం:	ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపి పొంగలి, రాగిజావ

ఎండీఎంలో నాణ్యమైన ఏర్పాట్లు..



జగనన్న గోరుముద్దలో భాగంగా ప్రతిరోజు ఒక్కో పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేస్తాం. ఎక్కడా మెనూను నిర్లక్ష్యం చేయడానికి అవకాశం లేకుండా ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ద్వారా పరిలిశీలిస్తుంది. దీంతో నిర్వాహకులు నిర్లిప్తంగా ఉండకుండా ఏ రోజుకు ఆరోజు మెనూను రుచిగా, శుచిగా ఆహారాన్ని అందిస్తున్నారు. మేము నిరంతరం పర్యవేక్షిస్తుంటాం.

– ఎంవీ సత్యన్నారాయణ, ఎంఈఓ–2, కారంచేడు

నేను కూడా ప్రతి రోజు రుచి చూస్తాను..



జగనన్న గోరుముద్ద పథకం విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రతి రోజూ క్రమం తప్పకుండా మెనూ అందిస్తుంటాం. అంతేకాకుండా రుచిలో ఎలాంటి రాజీ పడం. ప్రతి రోజు ఆహారాన్ని ఉపాధ్యాయులు రుచి చూస్తుంటారు. రుచి, శుచిలో ఎలాంటి తేడాలకు ఆస్కారం లేదు. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు మధ్యాహ్న భోజనాన్ని చక్కగా తింటున్నారు.

– పావులూరి శ్రీనివాసరావు, హెచ్‌ఎం, కుంకలమర్రు

థ్యాంక్స్ టు జగన్ మామ..



నా పేరు లాస్య, నేను కుంకలమర్రు మొయిన్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాను. ఇప్పుడు మాకు పెడుతున్న ఆహారం చాలా చాలా రుచిగా ఉంటుంది. శుభ్రంగా వడ్డిస్తారు. జగన్ సార్ చెప్పినట్టుగానే మాకు రాగిజావ, చిక్కీలు, కోడిగుడ్లు కూడా క్రమంతప్పకుండా ఇస్తున్నారు. దీంతో మాకు మంచి బలంగా ఉంటుంది. గతంలో సాయంత్రం ఇంటికి వెళ్లేసరికి నీరసంగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ సమస్య లేదు. సంతోషంగా బడికి వెళ్తున్నాం. థ్యాంక్స్ టు జగన్ మామయ్య.

వార్డు ఎన్నికలకు సర్వం సిద్ధం



స్వర్ణలో పోలింగ్ స్టేషన్ వద్ద సామగ్రితో అధికారులు

కారంచేడు/చినగంజాం: ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు మండలంలోని స్వర్ణ గ్రామంలో మిగిలి ఉన్న 13వ వార్డు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పటిష్టంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీఓ డీ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎన్నికల సామగ్రితో స్వర్ణకు బయలుదేరి మాట్లాడారు. ఉదయం 7గంటల నుండే పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బంది సిద్ధంగా ఉంటారన్నారు. 432 ఓట్లు మాత్రమే ఉన్నాయన్నారు. మధ్యాహ్నం 1గంట వరకు ఓటర్లు తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అక్కడ ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఎవరూ ప్రవర్తించవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, కార్యనిర్వహణాధికారి లక్ష్మీనారాయణ, పీఆర్ జేఈ సీహెచ్ రామచంద్రుడు, పోలింగ్ ఆఫీసర్ ఎంవీ సత్యన్నారాయణ, ఏపీవో అంజయ్య, సిబ్బంది డేవిడ్, సాయి, జానీలు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌ల వద్ద పటిష్టమైన బందోబస్తు..

శనివారం జరగనున్న ఎన్నికలకు సంబంధిచి పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని స్వర్ణ పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. కారంచేడు మండలం స్వర్ణ, ఇంకొల్లు మండలం పావులూరు గ్రామాల్లో వార్డు ఎన్నికలున్నాయన్నారు. రెండు గ్రామాల పరిధిలో 100 మంది పోలీస్ సిబ్బందితో పాటు, 30 మంది ప్రత్యేక బలగాలను నియమించామన్నారు. శుక్రవారం రాత్రి అంతా కూడా పెట్రోలింగ్ ఉంటుందని, ఎవరూ కవ్వింపులకు పాల్పడవద్దని హెచ్చరించారు. గెలిచిన అభ్యర్థులు కూడా ఎవరూ ర్యాలీలు, విజయోత్సవాలు చేయవద్దన్నారు. అలా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కారంచేడు ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పావులూరులో..

ఇంకొల్లు మండలం పావులూరు గ్రామ పంచాయతీకి నిర్వహిస్తున్న సర్పంచ్ ఉప ఎన్నిక పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ రాజ్యలక్ష్మి తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 3677 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. మొత్తం 12 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, రెండు పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయని, వాటిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9 పోలింగ్ బూత్‌లు, ఎస్సీ కాలనీలో మరో 3 పోలింగ్ బూత్‌లున్నట్లు తెలిపారు.

అంకితభావంతో పనిచేస్తే ప్రజాభిమానం

అద్దంకి: వృత్తిపై నిబద్దత, అంకితభావంతో ప్రజాభిమానం పొందుతారని స్థానిక తహశీల్దార్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉత్తమ సేవా పురస్కారాలు పొందిన వారి అభినందనసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభకు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సంధానకర్తగా వ్యవహరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సేవా పురస్కారంతో ఆ అధికారుల బాధ్యత మరింత పెరిగిందన్నారు. పశువైద్యశాఖ ఏడీ మోహన్‌రావు మాట్లాడుతూ పురస్కార గ్రహీతల సేవలను రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. తరువాత జిల్లాలో ఉత్తమ సేవా పురస్కార గ్రహీత విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఏవో కొర్రపాటి వెంకట కృష్ణ, ఏఎస్‌వో రావూరి అమర్‌నాథ్, మున్సిపల్ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ కే చెంచయ్య, ఆర్ఐ శంకర్, లైన్ ఇన్‌స్పెక్టర్ రావుపల్లి ఏడుకొండలు, పబ్లిక్ హెల్త్ వర్కర్ వీ రామకోటేశ్వరరావు, గోపాలమిత్ర జీవ గోవర్ధన్, జేఎల్‌ఎం గ్రేడ్ టూ తాళ్లూరు సాంబశివరావు, జేఏవో అందె రమేష్, పబ్లిక్ హెల్త్ వర్కర్ డీ వీరయ్య, బీ కోటమ్మ, జీ భీష్మలను రోటరీ క్లబ్ తరుపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ చప్పిడి వీరయ్య, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రిటైర్డ్ ఆర్జేడీ యూ దేవపాలన, కొల్లా భువనేశ్వరి, ఎస్ శంకరరెడ్డి, సీహెచ్ శేషారెడ్డి, నర్రా శ్రీలక్ష్మి, ఆంజనేయులు పాల్గొన్నారు.

జేవీవీ రాష్ట్ర సభల కరపత్రాలు ఆవిష్కరణ

చీరాల అర్బన్: జనవిజ్ఞాన వేదిక 17వ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 9, 10 తేదీల్లో చీరాలలోని బీఆర్ అంబేద్కర్ కమ్యూనిటి హాలులో నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్రా రామారావు శుక్రవారం తెలిపారు. స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు



పథకాలు వివరించి మహిళకు నమస్కరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- గడప గడపలో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శుక్రవారం మండలంలోని శింగరకొండపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుని అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీయం జగన్‌దేనన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, సర్పంచ్ వై తిరుపతయ్య, స్థానిక నాయకులు కాకాని రాధకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేష్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

యద్దనపూడి: మండలంలోని జాగర్లమూడి గ్రామంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న పఠాన్ సత్తార్‌ఖాన్ (56) అనారోగ్యంతో మృతి చెందాడు. గత 20 ఏళ్లుగా వీఆర్‌ఏగా పనిచేస్తున్న సత్తార్‌ఖాన్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మరణవార్త తెలిసిన వెంటనే తహశీల్దారు వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ బాపట్ల పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి తమ్మా అమ్మిరెడ్డి, వీఆర్‌ఓ కాలేషావలి, పంచాయతీ కార్యదర్శి శరత్, మండలంలోని ఆయా గ్రామాల వీఆర్‌ఏలు, సచివాలయ సిబ్బంది ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



సత్తార్‌ఖాన్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

20 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీకండువా కప్పి ఆహ్వానిస్తున్న కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలకు, పాలనకు ఆకర్షితులై మండలంలోని చినకొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన చింతా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య సమక్షంలో 20 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. చింతా బాలిరెడ్డి, రేగడి సుధాకర్‌రెడ్డి, దారం వెంకటేశ్వరరెడ్డి, పాలేపోగు సుబ్బయ్య, పాలేపోగు శ్రీనివాసరావు, తాటికొండ రాములు కుటుంబ సభ్యులకు కృష్ణచైతన్య పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, శింగరకొండపాలెం గ్రామ పంచాయితీ సర్పంచ్ వై తిరుపతయ్య, అవిశెన ప్రభాకరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జీరో షాడో డేపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం సీవీ రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జీరో షాడో డేను నిర్వహించారు. సైన్సు ఉపాధ్యాయులు పవని భానుచంద్రమూర్తి మాట్లాడుతూ జీరో షాడో సమయంలో ఏ వస్తువుపైన కాని, మనిషిపై కాని సూర్యుడి కాంతి పడినా నీడ కనిపించదని, దీనిని సాంకేతికంగా జెనిత్ పొజిషన్ (అత్యున్నత స్థాయి) అంటారన్నారు. ఈ కారణంగానే జీరో షాడో డే వస్తుందన్నారు. ఏటా రెండుసార్లు ఇలా జరుగుతుందన్నారు. కర్కాటక, మకరరేఖల మధ్యనున్న ప్రాంతంలోనే ఇది కనిపిస్తుందని, ఈ సమయంలో సూర్యుడి కాంతి మనిషి పరిధిని దాటి పోలేదని, అందుకే కింద నీడ పడదన్నారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగే క్రమంలో భ్రమణ అక్షం 23.5 డిగ్రీల మేర వంగిపోతుందన్నారు. ఈ క్రమంలో మన వాతావరణంలో మార్పు వస్తుందన్నారు. సూర్యుడు నడినెత్తి మీదకు కేవలం రెండు సార్లు ఉత్తరాయణంలో ఒకసారి, దక్షిణాయనంలో ఒకసారి వస్తాడని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగికి అభినందనల వెల్లువ

చీరాల టౌన్: చీరాల సహాయ బీసీ సంక్షేమ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా, ఏపీ సంక్షేమశాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు వెంకటేశ్వర్లుకు ఉత్తమ సేవా అవార్డు అందుకోవడంతో జిల్లాలోని పలు సంక్షేమశాఖల ఉద్యోగులు అభినందించారు. శుక్రవారం చీరాల కార్యాలయంలో ఉత్తమ అవార్డు పొందిన వెంకటేశ్వర్లును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సంక్షేమశాఖల నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో, ఉద్యోగ బాధ్యతలు అంకితభావంతో నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లుకు ఉత్తమ ఉద్యోగి అవార్డు తీసుకోవడంతో అభినందించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు రాజేష్‌దాసు, సోమశేఖర్, సుందరరావు, సైదారెడ్డి, అబ్రహం, సుబ్బారావు, సులోచన, లైమన్, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అమృతపాణి, వినయ్‌కుమార్

చీరాల రూరల్: అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంబేడ్కర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయాన్ని శుక్రవారం రాత్రి స్థానిక జంజనం కాంప్లెక్సులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి, విశ్రాంత పోలీసు కమిషనర్ కట్టా రాజ్ వినయ్ కుమార్, చేతులు మీదుగా ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. ప్రతినెలా 14వ తేదీన క్రమం తప్పకుండా సమావేశం ఏర్పాటు చేసుకుని సమస్యలపై చర్చించుకునే విధంగా తీర్మానం చేసి కమిటీతో ఆమోదింపజేశారు. కమిటీ అధ్యక్షుడిగా కట్టా రాజ్ వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎంపి. రత్నకుమార్, టి. ప్రభుదాసు, కార్యదర్శిగా జె. చిరంజీవి, ఉప కార్యదర్శులుగా ఎల్. జయరాజు, జి. అహరోను, ట్రెజరర్‌లుగా ఎస్. పౌలస్, జి. ఎజ్రాలను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా డి. రమణయ్య, గౌరవ సలహాదారులుగా డాక్టర్ వీ. అమృతపాణి, డి. విద్యాసాగర్, కె. శ్రీరాములు, సలహాదారులుగా ఎం. జాన్ పీటర్, కె. మార్క్, జి ఏసు రత్నంలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో జి. హరిహరరావు, విశ్రాంత తహశీల్దార్ కోటేశ్వరరావు, దేవరపల్లి కుమార్ బాబు, జెట్టి సుబ్బారావు, ప్రసాద్, దేవసహాయం, నాగూర్, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

యద్దనపూడి: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో తొలి శుక్రవారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావటంతో మహిళలు ఉదయాన్నే తలంటి నమాచరించి, ఇంటిగుమ్మాలకు మామిడి తోరణాలు, అలంకరించి నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని చింతపల్లిపాడులోని చెన్నకేశవస్వామి, పూనూరులోని త్రిపురసుందరిదేవి, నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో విశేషపూజలు, అర్చనలు చేశారు.

ఇత్తడి మకర తోరణాల బహూకరణ



మకరతోరణాలను ఊరేగింపుగా తరలిస్తున్న గ్రామస్తులు

మార్టూరు: మండలంలోని కోలలపూడి గ్రామంలో గల పోలేరమ్మ దేవతకు గ్రామస్తులు శుక్రవారం ఇత్తడి మకర తోరణాలను బహుకరించారు. రూ 60 వేలు విలువైన ఇత్తడి మకర తోరణాలు, కిరీటం, ఇతర అలంకరణ సామగ్రిని గ్రామస్తులు గ్రామ వీధుల్లో ఊరేగించి ప్రత్యేక పూజలు అనంతరం పోలేరమ్మ తల్లికి అలంకరించారు.